ప్రజాశక్తి
ఆదివారం 31 మార్చి 2024
5
పార్వతీపురం మన్యం

1 నుంచి పాలీసెట్‌కు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని ఎంఆర్ నగరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏప్రిల్ 1 నుంచి 24 వరకు ఉచితంగా పాలీసెట్-2024కు శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపల్ విలియం కేరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మెటీరియల్ కూడా ఉచితంగానే ఇస్తామన్నారు. పాలీసెట్‌కు దరఖాస్తు చేసుకోవడానికి ఏప్రిల్ 5 తుది గడువు అని చెప్పారు. దరఖాస్తు చేసుకునేవారు తమ 10వ తరగతి హాల్ టికెట్టు, పాస్పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు, మొబైల్ ఫోన్ తప్పకుండా తీసుకురావాలని సూచించారు. తమ కళాశాలలోని హెల్ప్‌లైన్ కేంద్రం ద్వారా ఉచితంగా రిజిస్టర్ చేస్తామన్నారు. పాలీసెట్ ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 27న జరుగుతుందని, వివరాలకు ప్రిన్సిపల్ విలియం కేరి, ఫోన్ నెంబర్ 9848374615, 8919519220, 9640318941 సంప్రదించాలని కోరారు.

గుమ్మిడిగెడ్డకు మోక్షమెప్పుడో?

- దశాబ్దాల కాలంగా ప్రతిపాదనలకే పరిమితం
- టిడిపి, వైసిపి, కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో హామీలే తప్ప నెరవేరని రైతుల కల

ప్రజాశక్తి - కురుపాం

దశాబ్దాల కాలం నుంచి గుమ్మడిగెడ్డ మినీ రిజర్వాయర్ నిర్మాణ పనులు జరగక రైతులకు నిరాశ మిగిలింది. పనులు జరుగుతుంటే గిరిజన ప్రాంతంలో గిరిజన రైతాంగంతో పాటు మైదాన ప్రాంతంలో రైతులకు సూమారు 10వేల ఎకరాల భూమికి సాగునీరందేలా ఉండేది కానీ రిజర్వాయర్ నిర్మాణ పనులు జరగక కేవలం 1500 ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతుంది. నిర్మాణ పనుల కోసం 2008లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అధికారులు ప్రతిపాదనలు పంపగా, అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి హయాంలో రూ.13.80 కోట్లు మంజూరు చేయగా సాంకేతిక సమస్యలున్నాయని,తోటపల్లి బ్యారేజ్‌కు ఇన్‌ఫ్లో తగ్గిపోతుందని ప్రాజెక్టు నిలుపుదల చేశారు. ఆ తర్వాత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో మళ్లీ అధికారులు ప్రతిపాదనలు పంపినప్పటికీ కనీసం ఆ ప్రస్తావనే లేకుండా పోయింది. కొత్తగా మినీ జలాశయం నిర్మాణానికి 2021-22లో రూ.39 కోట్లతో అధికారులు అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి పంపించినా మోక్షం కలగలేదు. గతేడాది కురుపాంలో జరిగిన అమ్మఒడి కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దృష్టికి ఈ సమస్యను స్థానిక ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి తీసుకొచ్చారు. దీనికి ఆయన స్పందించారు. అనంతరం రూ.44 కోట్లతో 4,500 ఎకరాలకు సాగునీరందించేందుకు ప్రతిపాదనలు తయారు చేసి పంపించారు. అయినా ఇంకా స్పందన రాలేదు. ఈ ప్రాంత రైతులు చిరకాల వాంఛను ఏ ప్రభుత్వ హయాంలో నెరవేరుతుందో వేచి చూడాల్సింది.

ఐదు దశాబ్దాలుగా నెరవేరని రైతులు కల

దాదాపు పదివేల ఎకరాలకు సాగునీరందించే సామర్థ్యం గల గుమ్మడి గెడ్డ మినీ రిజర్వాయర్ నిర్మాణ పనులు ఐదు దశాబ్దాలు నుంచి కాంగ్రెస్, టిడిపి, వైసిపి ప్రభుత్వాలు హామీ ఇవ్వడమే తప్ప ఇంతవరకు నిధులు మంజూరు చేసే పరిస్థితి లేదు. కనీసం డైవర్షన్ స్కీముకు షట్టర్లు కూడా పెట్టకపోవడం వల్ల మూడు వేల ఎకరాలకు కూడా సాగునీరు అందని పరిస్థితి. వట్టిగెడ్డ, రేగిడిగెడ్డకు గుమ్మిడిగెడ్డ అనుసంధానం చేస్తే కొన్ని వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. కావున రైతులంతా కదిలి రిజర్వాయర్ నిర్మించే వరకూ పోరాటం చేయాలి. ఈ పోరాటానికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మద్దతు ఉంటుంది.

ఎం.కృష్ణమూర్తి, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు.

ప్రతిపాదనలు పంపాం నిధులు మంజూరయ్యాయి

గుమ్మడిగెడ్డ మినీ రిజర్వాయర్ నిర్మాణ పనులకు రూ.44 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఎన్నికల కోడ్ వల్ల పనులు జరగడం లేదు. గతంలో ఐఎపి నిధులు కలెక్టర్ గ్రాంట్ నుంచి రూ.6 లక్షలు, మండల పరిషత్ నుంచి రూ.4లక్షలు నిధులతో కాలువలో పూడికతీతలు, సెట్టర్ల పనులను చేశాం. మినీ రిజర్వాయర్ వల్ల కురుపాం మండలంతో పాటు కొమరాడ మండలంలో 4,500 ఎకరాలు వరకు సాగునీరు అందుతుంది.

డి.ఉదయ్ భాస్కర్, ఇరిగేషన్ డిఇ.

ఎసిబికి పట్టుబడిన కార్యదర్శి కార్యదర్శి మురళి

ఎసిబికి చిక్కిన కార్యదర్శి

సాల్వెన్స్ ధ్రువపత్రానికి డబ్బులు డిమాండ్

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని కాశీపట్నం పంచాయతీ పరిధిలో కార్యదర్శిగా పనిచేస్తున్న పెంట మురళి రూ.2600 లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు పట్టుబడ్డాడు. మండలంలోని కన్నంపేటకు చెందిన చీకటి గణపతి తన తండ్రిని జైలు నుంచి విడిపించుకునేందుకు కొండయ్య చెరువుకు చెందిన ఇద్దరు పూచీదారుల కోసం సాల్వెన్స్ సర్టిఫికెట్ ఇవ్వాలని కన్నంపేట పంచాయతీ ఇన్చార్జిగా కార్యదర్శిగా ఉన్న మురళిని అభ్యర్థించారు. అయితే సుమారు రూ.4వేలు వరకు ఖర్చవుతుందని, డబ్బులిస్తేనే ధ్రువపత్రం ఇవ్వడం జరుగుతుందని ఖరాకండీగా చెప్పడంతో గణపతి ఎసిబిని ఆశ్రయించారు. ఎసిబి డిఎస్‌పి రామచంద్రరావు, సిబ్బంది వలపన్ని లంచం తీసుకుంటుండగా మురళిని అక్కడికక్కడే పట్టుకున్నారు. లంచం తీసుకున్నట్లు ధ్రువీకరించిన వెంటనే ఆయన్ను అరెస్టు చేసి తీసుకువెళ్లారు.

గిరిశిఖర గ్రామమైన తోటకు బైకుపై వెళ్తున్న ప్రవీణ్ ప్రకాష్

విద్యా ప్రమాణాలు పెరగాలి

రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జిల్లాలో రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ శనివారం విస్తృతంగా పర్యటించారు. తొలుత గుమ్మలక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డిజిటల్ క్లాస్ రూమ్ పరిశీలించారు. ద్విచక్ర వాహనంపై గిరిశిఖర ప్రాంతాల్లో సైతం పర్యటించారు. తోట గ్రామం నుంచి బైక్‌పై ఒండ్రుబంగికి చేరుకొని ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. పాఠశాల విద్యార్థిని ఇంటికి వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థుల వర్క్ బుక్‌లను పరిశీలించగా పూర్తిస్థాయిలో క్లాస్‌లు జరగకపోవడాన్ని గుర్తించారు. పుస్తకాలు విద్యార్థులకు పంపిణీ విషయంలో లోపాలున్నట్లు గుర్తించారు. డిఇఒ, పాఠశాల ప్రధానోపాధ్యాయునికి డిజిటల్ క్లాస్ బోధించాలని అడిగారు. డిజిటల్ విధానంలో బోధించడంలో తటపటాయించడంతో ప్రశ్నించారు. బైజుస్, డిజిటల్ క్లాస్ రూమ్ నిర్వహణపై అవగాహన ఉండాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం వేల కోట్ల విద్యపై ఖర్చు చేస్తోందని, దాని ఫలితాలు అందుకోవడంలో సరైన శ్రద్ధ ఉండాలని ఆయన అన్నారు. అధికారులకు, ప్రధాన ఉపాధ్యాయులకు డిజిటల్ తరగతుల నిర్వహణపై అవగాహన లేకపోతే పర్యవేక్షణ ఏవిధంగా ఉంటుందని ప్రశ్నించారు. ఐటిడిఎ పిఒ తమ పరిధిలో ప్రతి అంశాన్ని తీవ్రంగా పరిగణించి పర్యవేక్షించాలని సూచించారు. ఉత్తమ విద్యా విలువలు గల విద్యార్థులు తయారు కావాలని ఆదేశించారు. ప్రాథమిక స్థాయి విద్యా ప్రమాణాలు మెరుగు పడడం వల్ల విద్యార్థి మానసిక ఆలోచన మారుతుందన్నారు. అత్యుత్తమ విద్య అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఆయన చెప్పారు. అనంతరం పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ స్పాట్‌ను తనిఖీ చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ నిశాంత్ కుమార్, ఐటిడిఎ పిఒ సి.విష్ణు చరణ్, జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోబిక, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి డి.మంజుల వీణ, డిఇఒ జి.పగడాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ తవ్వకాలను అడ్డుకున్న గిరిజనులు

అధికారుల తీరుపై గిరిజన సంఘం నాయకుల ఆగ్రహం

ప్రజాశక్తి - సాలూరురూరల్

15 ఏళ్లుగా వివాదాస్పద గ్రామాల్లోకి ఒడిశా అధికారులు అభివృద్ధి, సంక్షేమం పేరిట అన్ని కార్యక్రమాలు నిర్వర్తిస్తున్నా ఆంధ్రా అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు వంతాల సుందరరావు, తాడంగి సన్నం విమర్శించారు. మండలంలోని ఎగువసెంబి, దిగులుసెంబి, ధూళిభద్రలో ఒడిశా అధికారులు అక్రమంగా మైనింగ్ తవ్వకాలకు వచ్చే గిరిజనులు అడ్డుకున్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ తమ ప్రాంతంలో మైనింగ్ తవ్వకాలు మొదలుపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని, ఇటువంటి ప్రయత్నాలు గిరిజనులకు సంబంధించి గ్రామసభల ద్వారా గానీ, అనుమతులు తీసుకోకుండా వారికి నచ్చిన విధంగా నిర్వహిస్తున్నారన్నారు. ముఖ్యంగా గిరిజనులకు సంబంధించి ఒక విధానం ఉంటుందని, దాన్ని కూడా పాటించకుండా వారికి నచ్చినట్టు ప్రవర్తించడం ఎంత సమంజసమని ప్రశ్నించారు. ఇటువంటి చర్యలను గిరిజన సంఘాలుగా తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఎన్నో తరాలుగా పోడు వ్యవసాయం చేసుకొని గిరిజనులు జీవం సాగిస్తున్నారని, అటువంటి భూములను అభివృద్ధి పేరిట అక్రమంగా ప్రభుత్వాలు గిరిజనుల నుంచి తీసుకొనేందుకు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. దీనికి నిరసనగా గిరిజనమంతా ఏకమై పోరాడుతామని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో మైనింగ్ నిమిత్తం వచ్చిన లారీలను గిరిజనులమంతా ఒక్కటై వెనక్కి పంపిస్తామన్నారు. ఈ ప్రాంతమంతా పీసా చట్టం అమలులో ఉందని, అయినా దౌర్జన్యంగా గిరిజనుల భూములను స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని, ఇటువంటి చర్యలను ఆంధ్రా అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, నాయకులు వంతల సుందరావు, టాడంగి సన్నం, మహేష్, కొమ్ములు, మంజు, సుభ తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ తవ్వకాలను అడ్డుకుంటున్న గిరిజన సంఘం నాయకులు, గిరిజనులు

ప్రశాంత ఎన్నికల నిర్వహణే లక్ష్యం : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా, సమర్ధవంతంగా నిర్వహించాలన్నదే లక్ష్యంగా అవసరమైన శిక్షణను అందించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. ఇవిఎం గోడౌన్‌ను వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాధారణ ఎన్నికలు సమర్ధవంతంగా, పటిష్టంగా నిర్వహించేలా ప్రతి నియోజకవర్గంలో ఇవిఎం, వివి ప్యాట్లపై శిక్షణ అందించనున్నామని అన్నారు. దీని కోసం నియోజకవర్గ స్థాయిలో ఆరు ఇవిఎంలు చొప్పున అందించనున్నామని తెలిపారు. ఇవిఎంలపై ఎటువంటి సందేహాలున్నా వాటిని నివృత్తి చేసి ఎన్నికలు సాఫీగా జరిగేలా చర్యలు చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. ఇవిఎంల శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకొని స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అందరూ సహకారం అందించాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

కంట్రోల్ రూమ్ పనితీరు పరిశీలన

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ పనితీరు, నిఘాను కలెక్టర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వెబ్ కాస్టింగ్ ద్వారా ఆంధ్రా - ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్ట్‌ల వద్ద వాహనాల తనిఖీలను పరిశీలించారు. జిపిఎస్ సిస్టం తో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల వాహనాలు ఉన్న ప్రదేశాల పర్యవేక్షణను, ప్రసార మాధ్యమాల ద్వారా సోషల్ మీడియాలో ప్రసారమౌతున్న కార్యక్రమాల్లో యాడ్ వర్స్ వార్తలపై నిఘా, సి -విజల్ ఫిర్యాదుల నమోదు, తదితర అంశాలపై క్షుణ్ణంగా పరిశీలించారు. ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోబిక, కంట్రోల్ రూం ఇన్ ఛార్జ్ అధికారి, ఎస్‌డిసి ఆర్‌వి సూర్యనారాయణ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఇన్చార్జి డిఆర్‌ఒ జి.కేశవ నాయుడు, తహశీల్దార్ కె.ఆనందరావు, డిప్యూటీ తహశీల్దార్ వెంకటరమణ, ఆర్‌ఐ వి.రామ కృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

పెదపదంలో ప్రచారం చేస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

గిరిజన హక్కుల సాధనకు పోరాటం : సిపిఎం

ప్రజాశక్తి - కొమరాడ

గిరిజన హక్కుల సాధన కోసం పోరాటం చేయాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు వాకాడ ఇందిరా కోరారు. మండలంలోని కూనేరులో గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజన ప్రజలతో శనివారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తితో కలిసి ఆమె మాట్లాడారు. గిరిజన హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా గిరిజన హక్కుల కోసం ఎల్లవేళలా పోరాటం చేయాలన్నారు. జీవో నెంబర్ 3 పగడ్బందీగా అమలు చేయాలన్నారు. అన్ని గిరిజన గ్రామాలకూ మంచినీటి సౌకర్యం కల్పించాలని, 1/70 చట్టాన్ని పగడ్బందీగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకంలో 200 రోజులు పని కల్పించాలని రోజుకు 600 రూపాయలు వేతనం కల్పించాలని జీడి పిక్కల ఫ్యాక్టరీ వెంటనే ప్రారంభించాలని కోరారు. గిరిజన హక్కులకై ఎల్లవేళలా పోరాటం చేస్తున్న ఎర్రజెండా నాయకత్వంలో ఎవరైతే ఎన్నికల్లో పోటీ చేస్తారో వారిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు ప్రసాదు, శంకర్రావు, మంగులు, రాజు, వెంకట్రావు, పార్వతి, గంగమ్మ, సుబ్బారావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శోభిక

మరో అవకాశమివ్వండి : రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు

ఎమ్మెల్యేగా మరో అవకాశం కల్పిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి పరుగులు పెట్టిస్తానని డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర అన్నారు. మండలంలోని పెదపదంలో ఆయన గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్‌తో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. తొలుత గ్రామంలో ఆయనకు స్థానికులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులు గురించి వివరించారు. మరో అవకాశమిస్తే మరిన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. గడచిన ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. మంచి జరిగితే వైసిపికి ఓటు వేయాలని చెప్పిన సిఎం జగన్ ఒక్కరే నని చెప్పారు. టిడిపి నాయకులు చెప్పిన కల్లబొల్లి మాటలు నమ్మితే ప్రజలు మోసపోతారని చెప్పారు. కార్యక్రమంలో జెసిఎస్ కన్వీనర్ కళ్లేపల్లి త్రినాధ్‌నాయుడు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. మామిడిపల్లిలో మండల వైసిపి అధ్యక్షులు సువ్వాడ భరత్ శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు సువ్వాడ రామకృష్ణ, పెద్దింటి మాధవ రావు ఇంటింటి ప్రచారం చేశారు. గ్రామంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. మరోసారి ఎమ్మెల్యేగా రాజన్నదొరను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సువ్వాడ శశికళ పాల్గొన్నారు.

50 కుటుంబాలు వైసిపి లో చేరిక

పట్టణంలోని మెంటాడవీధికి చెందిన సూపర్ బజార్ మాజీ డైరెక్టర్ మజ్జి అప్పారావు నాయకత్వంలో 50 కుటుంబాలు టిడిపిని వీడి వైసిపిలో చేరాయి. రాజన్నదొర నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్ మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ఆకర్షితులమై పార్టీలో చేరినట్లు మజ్జి అప్పారావు చెప్పారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు వంగపండు అప్పలనాయుడు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు జెసిఎస్ కన్వీనర్ గిరిరఘు కౌన్సిలర్ పప్పల లక్ష్మణరావు పాల్గొన్నారు.

బలిజిపేట : మండలంలోని నారాయణపురంలో స్థానిక ఎమ్మెల్యే, వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి అలజంగి జోగారావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలని అభ్యర్థించారు. ప్రచార కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు మండల ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు వెంట పాల్గొన్నారు

ఓటరుతో ఎటకారమా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఓటరుతో ఎటకారమా? అదీ ఎన్నికల వేళ...! ఎటకారమంటే మామూలు ఎటకారం కాదండోయ్... బాధ్యత మరిచి, హోదాను పక్కనబెట్టి మరీ అవహేలనగా, అవమానపర్చేలా... ప్రవర్తించడం జిల్లాలో చర్చనీయాశంగా మారింది. అందులోనూ సిట్టింగ్ ఎమ్మెల్యే, మరోసారి ఎమ్మెల్యేగా వెలగబెట్టేందుకు ఓట్లు ఆర్జించడం కోసం వెళ్లి మరీ గిరిజన మహిళ ఒంటిపై చేయివేసి, చీర, జాకెట్లు వేసుకుంటున్నావుగా? అంటూ సంబోధించడం పట్ల జనం విస్తుపోతున్నారు. ఆయన ఎవరో కాదు... విజయనగరం జిల్లాకు చెందిన బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి చినఅప్పలనాయుడు. తమ సమస్యలు పరిష్కరించాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు రెండు నెలల క్రితం సమ్మెబాట పట్టిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ఒళ్లు బలిసి సమ్మె చేస్తున్నారంటూ శంబంగి చేసిన వ్యాఖ్యలను రాష్ట్ర ప్రజానీకం యావత్తు తప్పుపట్టారు. ఆ మాటలను ఉపసంహరించుకోవాలంటూ పలు చోట్ల అంగన్‌వాడీలు, వారి తరపున యావత్తు మహిళలు, పలు సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ ఘటన ఇంకా మర్చిపోక ముందే మరో గిరిజన మహిళపై చేయివేసి మరీ శంబంగి వెటకారం ప్రదర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బొబ్బిలి మండలం డొంగురువలస గిరిజన గ్రామంలో ఓట్లు అర్జించేందుకు వెళ్లిన శంబంగిని 'ఊరుని అభివృద్ధి చేయలేదు, రోడ్లూ లేవు, కాలువలూ లేవు' అంటూ ఓ గిరిజన మహిళ నిలదీసింది. దీనికి బాధ్యతగా సమాధానం చెప్పాల్సిన ఎమ్మెల్యే 'ఇంతకు ముందు చీర కట్టావా? జాకెట్టు వేశావా? ఇప్పుడు కడుతున్నావు కాదా? మరి అది అభివృద్ధి కాదా? అంటూ నిస్సిగ్గుగా మాట్లాడారు. దీనికి బదులిచ్చిన ఆ మహిళ 'ఎక్కడున్నవాళ్లం అలాగే ఉన్నాం. అందుకే మమ్మల్ని వదిలేయండి' అంటూ ఆవేదన వ్యక్తం చేసింది. అప్పటికీ ఎమ్మెల్యే కళ్లు తెరుచుకోలేదు. 'ఏ ఊర్లో వారు ఆ ఊళ్లో ఉండక పొరుగూర్లో ఉంటారా? అంటూ సమాధానం చెప్పారు. అంతటితో ఆగలేదు. ఆయన వెంట వచ్చిన మరో నాయకుడు 'నీకు పెళ్లి అయినప్పుడు ఈ ఊరు ఇలాగే ఉందా? ఇప్పుడు డాబా ఇళ్లు కనిపిస్తున్నాయిగా అంటూ మరింత ఎటకారంగా మాట్లాడారు. ఆ వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ కావడంతో జిల్లాలో పబ్లిక్ టాక్‌గా మారింది. ఎమ్మెల్యే తీరుపై అన్ని తరగుతల ప్రజానీకం మండిపడుతున్నారు. అభివృద్ధి చేయడం చేతకాక, అమాయక మహిళలను అవహేళన చేస్తూ మాట్లాడడం ఆయనకు సిగ్గుచేటు అనిపించడం లేదేమో అంటూ నెటిజన్లు చర్చించుకుంటున్నారు. బొబ్బిలి ఎమ్మెల్యే చీరలు, జాకెట్లనే అభివృద్ధి అని చేసిందేముందిలే అంటూ మరికొందరు నవ్వుకుంటున్నారు. ఎన్నికల్లో ఓట్లు అడుక్కోవడానికి వచ్చినప్పుడే ఇలా వ్యవహరిస్తే గెలిచాక మరింత రెచ్చిపోతారో అని చర్చించుకుంటున్నారు.

వికలాంగులు, సీనియర్ సిటిజన్లకు ఫారం -12 డి

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

వికలాంగులు, 85 ఏళ్లు పైబడిన సీనియర్ సిటిజన్లు ఇంటి వద్ద ఓటింగ్ సౌకర్యం కోసం ఫారం 12 డిను సమర్పించాలని జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోబిక అన్నారు. వికలాంగులు, సీనియర్ సిటిజన్ల ఓటింగ్ అంశంపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం జాయింట్ కలెక్టర్ సమీక్షించారు. ఎన్నికల సంఘం ఓటర్లందర్నీ బయటకు వచ్చి సంబంధిత పోలింగ్ ఓటు వేయమని ప్రోత్సహిస్తుందన్నారు. ఓటు వేయలేని శారీరక వైకల్యం లేదా వయస్సు పైబడిన ఓటర్లు సైతం ఓటు హక్కు వినియోగించుకావాలని భావించామన్నారు. ఈ సౌకర్యం వినియోగించుకొనేందుకు వికలాంగులు, 85 ఏళ్లు పైబడిన సీనియర్ సిటిజనలు అర్హులని అన్నారు. వికలాంగులు, సీనియర్ సిటిజన్ ఓటర్ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయడానికి వికలాంగుల హక్కుల చట్టం, 2016 సెక్షన్ 2 కింద సంబంధిత అధికారి ధృవీకరించిన దివ్యాంగుల సర్టిఫికేట్ (కనీసం 40 శాతం వైకల్యం కలిగి ఉండాలి) కలిగి ఉండాలని, ఫారం 12డి దరఖాస్తుతో పాటు దివ్యాంగుల అంగవైకల్య ధృవీకరణ పత్రం కాపీని జతచేయాలని వివరించారు. సీనియర్ సిటిజన్లు - 85 ఏళ్లు దాటిన ఓటర్లు. ఓటరు జాబితా వివరాల్లో వయస్సు కలిగి, ఓటరు ఫారం 12డి ని సమర్పించాలని స్పష్టం చేశారు. రిటర్నింగ్ అధికారి ధృవీకరించిన, అర్హులైన ఓటర్ల ఇళ్లను బీఎల్ ఓ సందర్శిస్తారని ఆమె చెప్పారు. నోటిఫికేషన్ వచ్చిన 5 రోజుల్లోగా ఓటరు నుండి ఫారం-12డీని బి ఎల్ ఓ సేకరించి రిటర్నింగ్ అధికారికి సమర్పిస్తారని అన్నారు. ఫారం- 12డిలో సరైన వివరాలు ఉన్న ఓటర్లందరికీ పోస్టల్ బ్యాలెట్ పేపర్ జారీ చేస్తారని, సూక్ష్మ పరిశీలకులతో పాటు పోలింగ్ అధికారుల బృందం ఫారం- 12డి దరఖాస్తులో పేర్కొన్న చిరునామా వద్ద ఓటర్లను సందర్శిస్తుందన్నారు. ఈ ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయాలని ఆమె ఆదేశించారు. దివ్యాంగులు, సీనియర్ సిటిజన్ ల గుర్తింపులో పక్కాగా ఉండాలని అన్నారు. సమావేశంలో ఇన్ ఛార్జ్ జిల్లా రెవిన్యూ అధికారి జి కేశవ నాయుడు, వికలాంగులు, సీనియర్ సిటిజన్ల శాఖ సహాయ సంచాలకులు కె కవిత, జిల్లా భూగర్భ గనుల శాఖ అధికారి, నోడల్ అధికారి కె శ్రీనివాసరావు, పర్యవేక్షకులు చిన్నికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలతో మాట్లాడుతున్న కార్యదర్శి పార్వతీదేవి

హామీలను అమలు చేయాలి

ప్రజాశక్తి - పాచిపెంట

అంగన్వాడీ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ జీవోలను విడుదల చేయాలని మినీ అంగన్వాడీ ఉద్యోగులను మెయిన్ ఉద్యోగులుగా మార్చాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు మండలం ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యదర్శి కె.పార్వతీదేవి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కోడికాళ్లవలస వద్ద జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్నందున ఒంటిపూట అంగన్వాడీ కేంద్రాలు నడిచేలా చర్యలు చేపట్టాలన్నారు. సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన జీవోలు అమలు చేసి అంగన్వాడీ ఉద్యోగులను ఆదుకోవాలన్నారు. ఐసిడిఎస్ బలోపేతం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత కృషి చేయాలన్నారు. ఎన్నో కష్టాలు పడిన ప్రజలకు సేవలందిస్తున్న అంగన్వాడీ ఉద్యోగులను ప్రభుత్వాలు అన్ని విధాలా ఆదుకోవాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ట

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని పులిగుమ్మిలో దాతలు సాయంతో నిర్మించిన షిరిడీ సాయి మందిరం ప్రతిష్ట కార్యక్రమాలు వేడుకగా ముగిశాయి. శనివారం జరిగిన ప్రాణప్రతిష్ట కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవిలు, నియోజకవర్గ ఇన్చార్జి బోనెల విజయ్‌చంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన అన్నదాన కార్యక్రమంలో బందలుప్పి, లచ్చిరాజుపేట గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రసాదాలను స్వీకరించారు.

మాట్లాడుతున్న ఇఒపిఆర్‌డి సత్యం

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - సీతంపేట

వేసవి దృష్ట్యా ప్రతి పంచాయతీలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఇఒపిఆర్‌డి కొండపల్లి సత్యం ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం కార్యదర్శులతోనూ, విద్యుత్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో కూడలి బస్ షెల్టర్ వద్ద, జనాలున్న చోట చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో తాగునీరు సవస్య గుర్తించి ఆ సమస్య పరిష్కరించాలన్నారు. విద్యుత్ బిల్లులు చెల్లించడానికి చొరవ చూపాలన్నారు. ఇంటి పన్ను అందరూ శత శాతం లక్ష్యాలు పూర్తి చేయాలని చెప్పారు. కాలువల్లో పూడికలు తీయించి పారిశుధ్యం మెరుగుపడేలా చర్యలు చేపట్టాలన్నారు. చెత్త సంపద కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సర్వీసులు అందించాలన్నారు. సమావేశంలో కార్యదర్శులు పాపారావు, వినోద్, రామేశ్వరావు, నాయుడు, శ్యాంబాబు, ఊయక మురళి, శివాజీ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నల్ల మధుసూధనరావు

సెస్ బకాయిలు అందజేత

ప్రజాశక్తి -గరుగుబిల్లి

మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీల నుంచి గ్రంథాలయ సంస్థకు చెల్లించాల్సిన 8శాతం గ్రంథాలయ పన్నును పలు గ్రామపంచాయతీలకు చెందిన కార్యదర్శులు శనివారం గ్రంథాలయ నిర్వహణాధికారి నల్ల మధుసూదనరావుకు చలానా అందజేశారు. ఈ మేరకు ఇఒపిఆర్‌డి ఎల్.గోపాలరావు ఆధ్వర్యంలో గ్రంథాలయ సంస్థకు చెల్లించాల్సిన సెస్ బకాయిలకు సంబంధించిన చలానాలను అందజేశారు. ఈమేరకు ఉల్లిభద్ర, తోటపల్లి, పెదగుడబ, రావివలస, సంతోషపురం గ్రామ పంచాయతీలకు చెందిన గ్రామ పంచాయతీ కార్యదర్శులు గ్రంథాలయ సంస్థకు చెల్లించాల్సిన చలానాలను అందజేశారు. అలాగే మిగిలిన గ్రామ పంచాయతీలకు సంబంధించి గ్రంథాలయ సంస్థకు చెల్లించాల్సిన పన్నును తక్షణమే చెల్లించాలని ఎంపిడిఒ సూర్యనారాయణ గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు,తది తరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్లు సేకరించాలి

ప్రజాశక్తి - కురుపాం

అధికారికి వినతినిస్తున్న నాయకులు

సీనియర్ సిటిజన్, వికలాంగ ఓటర్లు నుంచి పోస్టల్ బ్యాలెట్లు కోసం ఫారం-12ను బూత్ లెవిల్ అధికారుల ద్వారా సేకరించాలని కురుపాం, కొమరాడ టిడిపి మండల కన్వీనర్లు కె.వి.కొండయ్య, శేఖర్ పాత్రుడు నియోజకవర్గ అసిస్టెంట్ ఎన్నికల అధికారి బిఎస్ఎస్ సత్యనారయణకు స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద శనివారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో వాలంటీర్లు వెళ్లి 12-డిలను సేకరిస్తున్నారని, దీనివల్ల సీనియర్ సిటిజన్, వికలాంగ ఓటర్లను ప్రభావితం చేసే అవకాశం ఉందని అసిస్టెంట్ ఎన్నిక అధికారికి వివరించామన్నారు. ఈ విషయంపై అసిస్టెంట్ ఎన్నిక అధికారి అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారని అన్నారు.

విద్యార్థులూ బహుపరాక్!

ప్రజాశక్తి - నెల్లిమర్ల

విద్యార్థి దశలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని బొండపల్లి ఎస్ఐ కె. లక్ష్మణరావు పిలుపునిచ్చారు. శనివారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యువత ఏ చిన్న తప్పు చేసినా అది పోలీసు రికార్డుల్లో నమోదయ్యే ప్రమాదం ఉందన్నారు. ఆ తరువాత ఉద్యోగాలకు ఎంపికైన సమయంలో పోలీసు కేసు నమోదై ఉంటే ఉద్యోగం కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రవర్తన ఎలా ఉండాలి అనే అంశంపై రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ఎస్. వర్మ వివరించారు. అకాడమిక్ డీన్ డాక్టర్ సన్నీడయోల్, పాల్గొన్నారు.

గంజాయి కేసులో ఏడాది జైలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఒకటో పట్టణ పోలీసు స్టేషన్లో గత ఏడాది నమోదైన గంజాయి కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ శనివారంతీర్పు వెల్లడించినట్లు సిఐ బి.వెంకటరమణ తెలిపారు. రైల్వేస్టేషన్‌లోని రిజర్వేషన్ కౌంటర్ వెనుకభాగంలో గత ఏడాది ఫిబ్రవరి 2న భర్తకాన శేఖర్, షేక్ ఖురేష్ గంజాయి ప్యాకెట్లు అమ్మడానికి ప్రయత్నించగా, ఒకటో పట్టణ పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. కేసు విచారణలో నేరం రుజువు కావడంతో ఏడాది జైలు శిక్ష పడిందని తెలిపారు.

సీతారామయ్యా ..మాపై నీ దయలేదయ్యా?

● కుల ధ్రువీకరణ పత్రాలు జారీపై ఎర్రగొల్లల ఆందోళన ● ఉన్నతాధికారులు దర్యాప్తునకు ఆదేశించినా తహశీల్దార్ నిర్లక్ష్యం ● 28 కుటుంబాలకు తప్పని కుల ధ్రువపత్రాల పాట్లు

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని తురక నాయుడు వలసలో గత పాతికేళ్లుగా 28 ఎరుకల కులాలుకు చెందిన వారు జీవనం సాగిస్తున్నారు. వీరంతా తమ కుల ధ్రువీకరణకై ఏడాదికాలంగా జియ్యమ్మవలస తహశీల్దార్ సీతారామయ్యకు వినతి పత్రాలను అందజేస్తున్నా కుల ధ్రువీకరణలు ఇవ్వడం లేదని ఎర్ర గొల్లలుగా పిలవబడే ఎరికలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరంతా ఎక్కడెక్కడ నుండో సంచారజాతులుగా తురకనాయుడు వలస వచ్చి అప్పట్లో గ్రామ పెద్దల అనుమతితో స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారు. గ్రామంలోని వీరికి ఎలాంటి పని కల్పించకపోవడంతో పాటు వివక్షత చూపడంతో వారంతా దొంగతనం ప్రవృత్తిగా కొనసాగుతున్నారు. దీంతో వీరిపై పోలీసులు అనేక కేసులు కూడా నమోదు చేశారు. నిజానికి దొంగతనం తమ వృత్తి కాదని తమలాగే తమ పిల్లల జీవితాలు మారకూడదని తమ పిల్లల భవిష్యత్తును కాపాడుకునేందుకే తమ కులంపై రెవెన్యూ అధికారులు దర్యాప్తు జరిపించాలని పలుమార్లు పాలకొండ, పార్వతీపురం ఆర్‌డిఒలతో పాటు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాలను అందించామని దీంతో కలెక్టర్, ఉన్నతాధికారులు స్థానిక తహశీల్దార్‌కు విచారణ జరిపించాలని ఆదేశించినప్పటికీ ఆయన నిర్లక్ష్యధోరణితో వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి ప్రధాన కారణం.. గ్రామంలో కొంతమంది తమకు ఎస్‌టి ఎరుకల ధ్రువీకరణలు ఇస్తే రానున్న రోజుల్లో ఈ గ్రామంలోని మిగిలిన కులాలకు రాజకీయంగా కొన్ని అవకాశాలు కోల్పోతాయని వారంతా గ్రామ సచివాలయ అధికారులకు బెదిరిస్తున్నారని తెలిపారు. ప్రస్తుత తహశీల్దార్ తమ కుటుంబాలకు మైగ్రేషన్ సర్టిఫికెట్లను తీసుకువస్తే కుల ధ్రువీకరణలు అందజేస్తామని చెప్పడంతో పాలకొండ తహశీల్దార్ కార్యాలయం నుండి మైగ్రేషన్ సర్టిఫికెట్లను తెచ్చామని తెలిపారు. వాటితో పాటు గతంలో ఇదే మండలంలో తహశీల్దార్‌గా పనిచేసిన కె. వెంకటరమణ 2016లో గొర్ల శ్రీరాములకు, తహశీల్దార్ కె.వి.ఎస్ భాస్కరరావు 2017లో గొర్రెలు వంశీకు, తహశీల్దార్ కె. గిరిధర్ 2021లో గొర్లి సురేషులకు ఎస్‌టి ఎరుకల కుల ధ్రువీకరణలు అందజేసిన పత్రాలను జారీ చేశారని ప్రస్తుత తహశీల్దార్ సీతారామయ్య మాత్రం కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం లేదని వాపోతున్నారు.

ఎర్రగొల్ల మహిళతో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంతకుమార్(ఫైల్)

ఒత్తిళ్లకు తలొగ్గి

రాజకీయ ఒత్తిడికో, స్థానిక వీఆర్‌ఒ ఇచ్చిన తప్పుడు సమాచారానికో, గ్రామస్తులు బెదిరింపులకో తెలియదు కానీ తమ కుల ధ్రువీకరణ పత్రాలను ఇచ్చేందుకు నిరాకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తమ 28 కుటుంబాలలో పిల్లలంతా వివిధ పాఠశాలల్లోనూ కళాశాలల్లోనూ విద్యనభ్యసిస్తున్నా కుల ధ్రువీకరణ లేక అనేక అవస్థలు పడుతున్నామని తెలిపారు. భవిష్యత్తులో తమతోపాటు ఈ సమాజం తమ పిల్లలకు కూడా దొంగలుగానే ముద్ర వేస్తుందని వారి భవిష్యత్తుకు కూడా తామే కారణం అవుతామన్న బాధ తమలో కొట్టిమిట్టాడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కులంపై సంపూర్ణ దర్యాప్తు జరిపించాలని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తమ కులం వారు ఎక్కడెక్కడ ఉన్నారో ప్రభుత్వగెజిట్లో చూసి తమది ఎస్‌టి ఎరుకల కులం కాదని నిరూపించాలని వారు డిమాండ్ చేశారు. లేనియెడల తామంతా రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తమ సమస్యను తీసుకువెళ్తామని హెచ్చరించారు.

వడగాల్పులతో ఉక్కిరిబిక్కిరి

నిర్మానుష్యంగా మారిన ప్రధాన రహదారి

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

వాతావరణ శాఖ ముందస్తుగా హెచ్చరించినట్లే శనివారం పట్టణంలోని వడ గాలుల తీవ్రతంగా వీచాయి. రోడ్ల మీదకు వచ్చేందుకు ప్రజలు ఆసక్తి చూపించలేదు. ఉదయం 7 గంటల నుండి బానుడు తన ప్రతాపం చూపించడంతో, ప్రజలు తన రోజువారి పనులు వేగంగా ముగించి ఇళ్లకు పరుగులు తీశారు. ఒకపక్క ఎండ వేడి, మరోపక్క, ఉక్క పోత, ఇంకొపక్క వడగాలులు అధికంగా వీచడంతో రోడ్లపై జనసంచారం లేక రహదారులన్నీ నిర్మానుష్యంగా మారాయి. మే నెలలో ఉండవలసిన వాతావరణ పరిస్థితి, మార్చి నెలలోనే ఉండడంతో రానున్న రెండు నెలలు వాతావరణం ఏ విధంగా ఉంటుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

ఎండల తీవ్రత జాగ్రత్తలు పాటించాలి

గరుగుబిల్లి : ప్రస్తుతం ఎండల తీవ్రత పెరగడంతో వడదెబ్బకు గురి కాకుండా ఉండేలా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉందని మండల పరిధిలోని రావివలస ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ కె కార్తీక్ వెల్లడించారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికమైన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆరుబయట పని చేసేవారు ఏదైనా పనినిమిత్తం బయటకు వెళ్లేవారు జాగ్రత్తగా ఉండాలన్నారు. తరచూ నీళ్లు తాగడంతో పాటు డిహైడ్రేషన్ తలెత్తకుండా చూసుకోవాలన్నారు. బయటకు వెళ్లేవారు తెలుపు లేతరంగుల పలుచటి కాటన్ వస్త్రాలు ధరించాలన్నారు. తలపై టోపీ పెట్టుకోవాలని, రుమాలు చుట్టుకోవాల్సి ఉందన్నారు. నీళ్లు, నిమ్మరసం, కొబ్బరి నీళ్లు, మజ్జిగ, ఓఆర్‌ఎస్, వంటివి తాగాలని తెలిపారు. ఎండలో పనిచేసేవారు ఇబ్బందిగా అనిపిస్తే తక్షణమే చల్లని ప్రదేశంలో సేద తీరాలన్నారు. అధిక వేడివల్ల ఆహారం త్వరగా పాడవుతుందని అటు వంటివి తింటే డయేరియాకు గురయ్యే ప్రమాదం ఉందని అన్నారు. ముఖ్యంగా పిల్లలు, గర్భిణులు, వృద్ధులు, మధ్యాహ్నం పూట బయటకు వెళ్లొద్దని వైద్యాధికారి డాక్టర్ కార్తీక్ సూచించారు.

డాక్టర్ కార్తీక్

ఎంఇఒల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండల విద్యాశాఖ అధికారులు-1 వృత్తిపరంగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రవీణ్ ప్రకాష్‌కు వినతిపత్రం సమర్పించినట్లు ఎంఇఒ-1 అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం తెలిపారు. శనివారం జిల్లా పర్యటనకు విచ్చేసిన ప్రవీణ్ ప్రకాష్‌ను కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశామన్నారు. మండల విద్యాశాఖ అధికారిగా దాదాపు 150 నుండి 300 మంది టీచర్ల జీతభత్యాలను చేస్తున్న డిడిఒలుగా ఉన్న ఎంఇఒ-1లకు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ కల్పించాలని కోరామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంఇఒ-1,2లకు విడుదల చేసిన జాబ్ చార్ట్ ఉత్తర్వులు జీవో నెంబర్ 89కు విరుద్ధంగా చాలాచోట్ల డిఇఒలు అన్ని విధులను ఎంఇఒ-1లు చేయాలని ఒత్తిడి తెస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయంలో జీవో 89 ప్రకారం జాబ్ చార్ట్ ఖచ్చితంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. ఎంఇఒలుగా పాఠశాలల పర్యవేక్షణ, సందర్శన బాధ్యతలు నిర్వహిస్తున్న తమకు వాహన సౌకర్యం కల్పించాలని కోరినట్లు తెలిపారు. తమ వినతిపై ప్రిన్సిపల్ సెక్రటరీ సానుకూలంగా స్పందించారని సింహాచలం తెలిపారు.

పట్టణంలో పాస్టర్ల ర్యాలీ

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఏసు మరణం సర్వ మానవాళి రక్షణ కోసమేనని విశాఖ సెనెడ్ బిషప్ సుదర్శనరావు అన్నారు. ఈస్టర్ పర్వదిన ఉత్సవాల భాగంగా శనివారం పాస్టర్స్ యువజన విభాగం ఆధ్వర్యంలో పట్టణంలో జరిగిన రన్ ఫర్ జీసస్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసు మరణాన్ని గెలిచి ప్రజలను కాపాడేందుకే వచ్చాడని, సర్వమానవాళి ఐకమత్యమే ఏసు అభీష్టమని, మానవాళిని రక్షించడానికి వచ్చిన ఏసుకు మనమంతా రుణపడి ఉంటామని అన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి, నాలుగు రోడ్ల జంక్షన్, పాత బస్టాండ్ కూడలి వద్ద ప్రజలు అంతా సంతోషంగా ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిషప్ తిమోతి, పాస్టర్లు సూర్య ప్రకాష్, విజయ్ కుమార్, గోపి, సుదీర్ల పాల్గొన్నారు.

వీరఘట్టం : స్థానిక తెలుగు బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో శనివారం ఏసు కొరకు పరుగెత్తు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంఘ కాపరి అభిషేక్ మాట్లాడుతూ తెలుగు బాప్టిస్ట్ చర్చి నుండి ప్రధాన రహదారి మీదుగా చిదిమి గ్రామ జంక్షన్ వరకు సువార్త చాటుకుని ర్యాలీ చేశామన్నారు. ఏసు కొరకు పరిగెత్తు పందెంలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు ప్రేమభూషణరావుతో పాటు సంఘ కార్యవర్గం, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ర్యాలీ చేస్తున్న పాస్టర్లు

ఎమ్మెల్యేతో కలిసి పనిచేస్తా

టిడ్కో చైర్మన్ ప్రసన్న కుమార్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను పోటీ చేయడంలేదని, స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావును రెండవసారి ఎమ్మెల్యేగా గెలిపించేందుకు తన కార్యకర్తలతో కలిసి పని చేస్తాననీ టిట్కో రాష్ట్ర చైర్మన్ జమ్మన ప్రసన్నకుమార్ అన్నారు. శనివారం పట్టణంలో బైపాస్ రోడ్‌లో ఉన్న వైసిపి జిల్లా కార్యాలయంలో పార్టీ మన్యం జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజ్ ఆధ్వర్యంలో జరిగిన పార్టీ సమావేశంలో ప్రసన్నకుమార్ మాట్లాడారు. మరోసారి జోగారావును గెలిపించడానికి పనిచేస్తామన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి జోగారావు మాట్లాడుతూ, వైసిపి నాయకులు వైవి సుబ్బారెడ్డి, విజయసాయి రెడ్డిలు ఇద్దరినీ కూర్చోబెట్టి మాట్లాడారని ఎన్నికల అనంతరం జమ్మాన ప్రసన్న కుమార్‌కు పార్టీలో సముచితమైన స్థానం ఇవ్వడానికి మాట ఇచ్చారని చెప్పారు. ఈ సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు భాస్కరరావు, జిల్లా వ్యవసాయ శాఖ చైర్మన్ వాకాడ నాగేశ్వరరావు, మూడు మండలాల ప్రజా ప్రతినిధులు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రసన్నకుమార్, ఎమ్మెల్యే జోగారావు

ఎన్నికల విధుల్లో వాలంటీర్లు వద్దు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఎన్నికల విధుల్లో సచివాలయం వాలంటీర్లు జోక్యం చేసుకోవడం, పాల్గొన్నడం చేయరాదని, అతిక్రమిస్తే చర్యలు ఉంటాయని పార్వతీపురం ఎంపిడిఒ ఆకిబ్ జావేద్ అన్నారు. శనివారం మండలంలోని చినబొండపల్లి గ్రామంలో తహశీల్దార్ కె ఆనందరావు అధ్యక్షతన గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు ప్రజలు సహకరించాలని నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. ప్రజలకు ఓటు హక్కు పై అవగాహన కల్పించారు. ఈనెల 15వ తేదీ వరకు 18 సంవత్సరాల వయసు వారు ఓటరుగా నమోదు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి స్వాతి, సర్పంచ్ గండి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్‌డిఒ హేమలత

ఎన్నికల శిక్షణా తరగతులను పరిశీలించిన ఆర్‌డిఒ

స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయ సమావేశ భవనంలో శనివారం సహాయ పోలింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమాన్ని ఆర్‌డిఒ కె.హేమలత పరిశీలించారు. ఎపిఒలకు శిక్షణ ఎంతవరకు అవగాహన ఉందన్నది పరిశీలించేందుకు వారిని ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. ఈ సందర్భంగా వారి సందేహాలకు సమాధానాలు ఇచ్చి నివృత్తి చేశారు.

పన్నుల వసూళ్లలో మున్సిపల్ కమిషనర్

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఇంటి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు చెల్లింపునకు ఈనెల 31వ తేదీన గడువు ముగియడంతో శనివారం సాయంత్రం మున్సిపల్ కమిషనర్ కె శ్రీనివాస్, మున్సిపల్ రెవిన్యూ ఇన్‌స్పెక్టర్లు పి. నారాయణ రావు, జి.వినయ్ కుమార్, వార్డు సచివాలయాల కార్యదర్శిలతో కలిసి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి రూ.2.80 లక్షలు వసూలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రభుత్వం ఇచ్చిన వడ్డీ రాయితీని వినియోగించుకుని పన్నులను చెల్లించి పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

నేటి రాత్రి 12 వరకు పన్నులు చెల్లించొచ్చు

మున్సిపాల్టీ పరిధిలో చెల్లించాల్సిన ఆస్తి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులు ఆదివారం రాత్రి 12 గంటల వరకు చెల్లించవచ్చునని మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 31తో పన్నులు చెల్లింపు చేసేందుకు గడువు ముగియనున్నందున పన్ను చెల్లింపుదారులు మీమీ సచివాలయాల్లో గానీ, ఆన్లైన్లో గానీ మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యాష్ కౌంటర్ వద్ద ఆదివారం రాత్రి 12 గంటల వరకు చెల్లించేందుకు అవకాశం ఉందని తెలిపారు. పన్ను చెల్లింపుదారులకు ప్రభుత్వం ఇచ్చిన వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకొని చెల్లింపులు చేయాలని కమిషనర్ కోరారు.

పన్నుల వసూళ్లు చేస్తున్న కమిషనర్

అధికారులు ఫుల్ ... రోగులు నిల్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని నాలుగో సచివాలయ పరిధిలోనే ఆర్‌సిఎం పాఠశాల వద్ద శనివారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి వైద్యులు ఫుల్‌గా ఉన్నప్పటికీ రోగులు లేక వెలవెలబోయింది. ఈ కారణంగా రోగుల్లేక వైద్య సిబ్బంది గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అడపాదడపా వచ్చే రోగులకు వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బందితో పాటు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

రోగులు లేక ఖాళీగా ఉన్న వైద్య శిబిరం

శివ్వాంలో ఆరోగ్య సురక్ష

గరుగుబిల్లి : మండలంలోని శివ్వాంలో శనివారం ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని స్థానిక వైద్యాధికారి డాక్టర్ కెకె సాగర్ వర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిబిరానికి వచ్చిన రోగుల ఆరోగ్య సమస్యలను అడిగి వారికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అలాగే గర్భిణులకు హిమోగ్లోబిన్, బిపి, షుగర్ పరీక్షలు చేసి రక్తం తక్కువగా ఉన్న వారికి ఐరన్ టాబ్లెట్ ఇస్తూ ఆహారంలో తగు జాగ్రతలు తీసుకోవాలని, హిమోగ్లోబిన్ పెరిగేంత వరకూ పర్యవేక్షణ చేయాలని సిబ్బందికి సూచించారు. చెవి, ముక్కు, వైద్యులు, కంటికి సంబంధిత తనిఖీలను చేశారు. దీర్ఘకాలిక రోగాలు, 60పై బడిన బాలింతలు, చిన్న పిల్లలు వచ్చిన వారికి కావాల్సిన వైద్య పరీక్షలు, మందులు అందజేశారు. అలాగే ఆర్‌బిఎస్‌కె అధికారి రఘు శిబిరానికి వచ్చి పర్యవేక్షించారు. కార్యక్రమంలో స్పెషలిస్ట్ వైద్యులు ఎస్.కోటేశ్వరరావు, సూపర్వైజర్ చిన్నమ్మ, రమణమ్మ, ఉదయకుమారి, వైద్య సిబ్బంది, 104 దుర్గాప్రసాద్, శివ, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

పుట్టూరులో భవిష్యత్తుకు గ్యారంటీ

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

నియోజకవర్గం కూటమి అభ్యర్థి బోనెల విజయ్ చంద్ర ఆధ్వర్యంలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని పుట్టూరులో శనివారం నిర్వహించారు. సూపర్ సిక్స్, మేనిఫెస్టోలో అంశాలను ప్రజానీకానికి వివరిస్తు గ్రామంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, గొట్టాపు వెంకటనాయుడు, బోను చంటి, నాయుడు, ఆగురు మణి, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపితోనే నియోజకవర్గం అభివృద్ధి

జియ్యమ్మవలస : తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడుతోనే కురుపాం నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వీరేష్ చంద్రదేవ్ అన్నారు. శనివారం మండల పార్టీ అధ్యక్షులు పల్ల రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన జయహో బిసి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కురుపాం నియోజకవర్గం ఉమ్మడి అభ్యర్థి తోయక జగదీశ్వరిని ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు

పార్వతీపురం: ప్రచారం చేస్తున్న విజయ్ చంద్ర

గిరిజనులకు వ్యవసాయ పనిముట్లు అప్పగింత

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని దర్సింగి గ్రామంలో రెండు రోజుల క్రితం గిరిజన రైతుల వద్ద అటవీశాఖాధికారులు స్వాధీనం చేసుకున్న వ్యవసాయ పరికరాలను తిరిగి కొమరాడ రేంజర్ విఎస్ఎన్ రాజు ఆధ్వర్యంలో శనివారం అప్పగించారు. అనంతరం గిరిజన రైతులను ఉద్దేశించి రేంజర్ ఇవిఒవిఎస్ఎన్ రాజు మాట్లాడుతూ 2005 డిసెంబర్ 13కు ముందు గిరిజనులు సాగుచేసిన భూమికి పట్టాలు ఇచ్చామని ఆ భూముల్లోనే కొండపోడు చేయాలి తప్ప అధనంగా కొత్త పోడు భూములు చేయరాదని తెలిపారు. దీనివల్ల కాలుష్యం బాగా పెరిగి వర్షపాతం కూడా బాగా తగ్గే అవకాశం ఉందని అన్నారు. అనంతరం ఆయన సమక్షంలో రెండు రోజుల క్రితం కొండ పోడు భూమి సాగు చేసిన మంగులు, చిన్నయ్య, శంకర్రావు, తానబాబు, వెంకట్రావుల వద్ద నుంచి అధికారులు తీసుకున్న కత్తి, గొడ్డలి రేంజర్ సమక్షంలో మండల సెక్షన్ ఆఫీసర్ గౌరీ శంకర్రావు,బీట్ ఆఫీసర్ సత్యనారాయణ రావు, మీనారావు గిరిజనులకు అందించారు.

పనిమునిట్లును అందిస్తున్న అధికారులు

చెక్ డ్యామ్ నిర్మించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

తమ గ్రామాలకు సమీపాల్లో గల రాళ్లగెడ్డపై చెక్‌డాం నిర్మించాలని మండలంలోని చిన్నగోర, మామిడిమాను గోర, కొండవానిగోర గ్రామాలకు చెందిన గిరి రైతులు అధికారులను కోరుతున్నారు. ఈ మూడు గిరిజన గ్రామాలకు సంబంధించి సుమారు 170 ఎకరాల్లో సస్యశ్యామలంగా పంటలు సాగు చేయాలంటే సాగునీరు అవసరమై ఉన్నందున పైనించే వచ్చే నీరు నిల్వ ఉండేందుకు, వాటిని నిల్వ చేసేందుకు ఎటువంటి చెక్‌డాం లేకపోవటం వల్ల నీరు వృథాగా పోతుండడంతో పంటలు సాగు చేసుకోలేకపో తున్నామని, గత డిసెంబర్ 27న వాసన సంస్థ ఆధ్వర్యంలో హెచ్‌డిఎఫ్‌సి సహకారంతో రాళ్లగెడ్డ నుంచి భూములకు పైప్‌లైన్లు ఏర్పాటు చేయడంతో పాటు సోలార్ సిస్టం పంపుసెట్లు కూడా ఏర్పాటు చేశారు. అయితే ఇక్కడ చెక్ డాం నిర్మించాలని అప్పట్లో కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెక్ డాం ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల గిరిపుత్రులు కోరుతున్నారు.